# ఉన్నత శిఖరాలు

రచన: "శ్రీ రాజా"

ఊరికి పొలిమేరలో ఉందొక పర్ణశాల. అది ఆ ప్రాంతానికి ఒక క్రొత్త శోభ నిస్తుంది. ఆ ప్రాంతానికి వెళ్ళిన వాళ్ళెవరైన ఆ పర్ణశాలలోనికి వెళ్ళకుండా ఉండలేరు. ఆ పర్ణశాల కూడా వారిని ఆహ్వానించకుండా ఉండలేదు. ఇంతకీ దాన్నసలు పర్ణశాల అని ఎందుకుంటున్నాను అంటే ఎందుచేతనోగాని దాన్ని ఇల్లు అని అన బుద్ధి కావడం లేదు. ఇంకా కావలస్తే ఆశ్రమము అనవచ్చు. అనవచ్చేంటి? అదే కూడా కావచ్చు, నిక్కచ్చిగా చెప్పలేను కాని-

ఇంతకి ఆ పర్ణశాల ఏంటంటే మూడు జీవుల నివాస మందిరం. ఆదర్శ మందిరం, అనురాగ మందిరం. ఇంతకీ ఆ మూడు జీవులు ఏంటంటే ఒకటి జీవితమంతా దేశ సేవకోశం మిలటరీలోనే గడపి, రిటైరయి నిష్కల్మషమైన దేశభక్తి పూరితమైనటువంటి తన లోకం నుండి వచ్చి ఈ కల్మష పూరిత మైనటువంటి లోకంలో ఉండటం కష్టమని తలచి, ఉండకుండనూ కూడా ఉండలేమని కూడా తెలిసి అక్కడ ఉంటూన్న ఆ దర్శవ్యక్తి "ఆదర్శ" ఇక రెండు ;- చిన్న తనంలో ఆదర్శను ప్రేమించి, పరిస్థితుల ప్రాబల్యంగా వేరొకరితో కాపురం చేసి, అతడు చనిపోయిన తరువాత ముసలి తనంలో తనకోసమే పరితపించే ప్రేమాస్పదుడు ఆదర్శ దగ్గరే అతనికి సేవ చేసుకుంటూ కాలం వెళ్ళబుచ్చు కొందామనుకొనే "జోగాయమ్మ". మూడు:- ఈ రెండు ప్రాణాల్ని తనలో ఉంచుకొని తన అంతం తరవాతే వారి అంతం జరగాలి, అంత వరకూ వారి మీద ఈగ, కూడా వాల కూడదు అనే స్వామి భక్తి, దైవభక్తి, రాజ భక్తి కలిగిన బిడ్డకాని బిడ్డ "కృపా" అనబడే కుక్క. బహుసా ఈ మూడు ప్రాణులూ లోకంలో కనబడేవేమో, ఉండలేమో, నిజమే-ఉండవు. ఎంచేతంటే ఉంటే అటువంటివాళ్ళు లోకానికి సన్నిహితంగా ఉండరు. ఇలా ఏ మూలో ఉంటారు మరి అలా ఎవరూ లేరుగా?

◆ ◆ ◆

అసలు నిజానికి ఆ ఆశ్రమంలో ఉండవలసింది ముగ్గురు కాదు. ఇంకా బోలెడంత మంది ఉండాలి నిజానికి. ఆ రకంగా చూస్తే ఆ ఆశ్రమాన్ని ఎంతో పెద్దది చేయవలసి ఉంటుంది. కాని అక్కడకు ఎవరూ రారు. ఎంచేతంటే చాలా కారణాలున్నాయి, చెప్పుకోడానికి లెక్కకు కూడా అందదేమో. ముఖ్యంగా అందులో కొన్ని ముఖ్యమైనవి ఏంటంటే? ఒకటి :— అక్కడ కృపాగాడి దయ ఉండకపోయినా, వాడు కటాక్షించకపోయినా ప్రమాదమని తలచడం. రెండు :- మహాకవి ఆత్రేయ "చిలిపి అల్లరి తెలిసినంతగ వలపు తెలియక మెచ్చలేరే వెచ్చని హృదయాల పొంగడి మధుర గీతి" అన్నట్టు అదర్శ జోగాయమ్మగారల ప్రేమను గ్రహించక పోవటం. మూడు :-ఇది వరకటిలాగ ఎక్కువ జీతం లేక పోవటం వల్ల కూర్చొని తినడం జరగదని తెలుసుకోవటం. ఇవి అసలు కారణాలు,

కె. పి. జి. వారి అపూర్వ కానుక !!

* రాజా ఇజిప్షిన్ * టిప్‌టాప్ ప్లైన్.
* గోరా ఇజిప్షిన్ * చిల్డ్రిన్
* గోల్డన్ డాలర్ * కె. పి. జి. ఇంటర్‌లాక్
మరియు ఇతర రకాలకు ప్రసిద్ధి చెందిన పేరు

"కె. పి. జి."

: తయారించువారు :

K. P. G. Knitting Co.
4/2, Harvey Road :: TIRUPUR-638601

ఇంకెవరొస్తారు ? చీమ కూడా రాదు. ఎంచేత అంటే అంచేతే.

అసలు ముఖ్యంగా ఆదర్శ, జోగాయమ్మ గారల గురించి ప్రజలకు తెలిసిందేంటంటే "వాడికి పెళ్ళాం చనిపోయింది, దీనికి మొగుడు చనిపోయాడు వాళ్లిద్దరూ ఎప్పుడో ప్లాను వేసుకున్నారు" అని. ఇలా ఆలోచించుకొనే, సొంతకొడుకు, "కృపా" కూడా తండ్రి మిలటరీలో ఉండి సంపాదించిందంతా తను కూర్చొని తిని, తిరిగి ఆ తండ్రి ఇపుడు మిలటరీ నుండి తిరిగి వస్తే మొహమన్నా చూపించకుండా దూరంగా ఉన్నాడు. అందుకే రక్త సంబంధాన్ని మానవ ప్రవృత్తినీ కూడా మరచినటువంటి ఆ కొడుకు కంటే, శరీరాన్ని, జీవితాన్ని హృదయాన్నీ చివరకు సర్వస్వాన్నీ కూడా తనకే అర్పించడానికి సిద్ధంగా ఉన్న కుక్కే నయం అని తలచే నిజమైన ఆ కృపా తన కొడుకు కాదని తలచి ఆ పేరు తన ప్రియమైన కుక్కకు పెట్టుకొని నిజమైన ప్రేమ, వాత్సల్యము తద్వారా వాటి ప్రతి ఫలం పొందుతున్నాడు.

నిజమే మరి. మనుషులపై చూపిన ప్రేమల కన్నా అదే కాలంలో అదే ప్రేమను జంతువుల మీద చూపిస్తే ఎంత సార్థకత లభిస్తుంది.

"కృపా" ఆదర్శ, జోగాయమ్మగారలు అనుంగు బిడ్డ, అలాగే ఆదర్శ జోగాయమ్మ గారలు కూడా కృపాకు తండ్రి తల్లి. కృపాకు ఎవరన్నా తెలిసినవారు ఏడిస్తే ఎంతో బాధ నిపిస్తుంది. అప్పుడు తన కాలితో వారి కన్ను తుడుస్తాడు, అది మిలటరీలో ఉన్నపుడే మప్పేశాడు ఆదర్శ.

ఒకనాడు ఎంత పట్టుదలగా ఉన్నా రక్త సంబంధాన్ని తట్టుకో లేక తలచుకొని ఏడుస్తున్నాడు ఆదర్శ. జోగాయమ్మగారు ఎంత బ్రతిమిలాడినా ఊరుకోవడం లేదు. అపుడు జోగాయమ్మగారు కూడ బాధను దిగమ్రింగుకో లేక ఏడ్చుకుంటూ లోపలకు పోయారు. లోపల పెరట్లో ఉన్న కృపా అప్పుడు వాత్సల్యంగా దగ్గర కొచ్చి జోగాయమ్మగారి కాలు నాకసాగింది. అప్పుడు జోగాయమ్మగారికి ఒక చక్కటి ఆలోచన తట్టింది. వెంటనే కృపాను పిలిచి ఆదర్శ ఏడుస్తున్నట్టుగా చెప్పింది. వెంటనే విపరీతమైన పరుగుతో వెళ్ళి కృపా ఆదర్శని తట్టి లేపి కాలు పైకెత్తి కన్ను మీద జోరుగా చెరిపేశాడు. ఆ తొందర్లో ఆదర్శ కంటి దగ్గర ఒక పెద్ద గంటు పడి రక్తం వచ్చింది. అంతలో జోగాయమ్మగారు ఇది చూసి కఱ్ఱ పట్టుకొని కృపా వెంట పడింది.

వెంటనే కృపా పెరట్లోకి వేగంగా పోయింది. అయినా జోగాయమ్మగారు పట్టు విడవకుండా పెరట్లోకి వెళ్లారు. అడ్డుకుందామని ఆదర్శ కూడా పెరట్లోకి వచ్చాడు. ఇలా ఇద్దరూ వెళ్ళి అక్కడ పెరట్లో జరుగుతున్న దృశ్యం చూసి కొయ్యబారి పోయారు. ఇంతకీ అదేం టంటే ఆ దర్శ బుగ్గమీద అలా రక్కినందుగాను కృపా తన్ను తనే వళ్ళంతా రక్కేసు కుంటుంది. వెంటనే ఇద్దరూ కృపాని పిల్చి మందు పెట్టి పడుకో బెట్టారు. అప్పట్నుండీ ఆదర్శగాని, జోగాయమ్మగారు గాని ఎవరూ కూడ ఏమీ అనరు కృపాను. ఆ రోజు నుంచీ ఆదర్శకు ఈ కృపా మీద మరింత ప్రేమ పెరిగి పోయింది. ఆ కొడుకు కృపా మీద మరింత ఆశ సన్నగిల్లి పోయింది.

ఇలా ఉండగా ఇక్కడ ఏమైనా ఆస్తి ఉందనే వచ్చారో, లేక ఎవరైనా కిట్టనివాళ్ళు అలా పంపితే వచ్చారో తెలీదు గాని, ఒకరోజు రాత్రి మాత్రం కొంతమంది దొంగ వచ్చారు. చీకటి. ఏదో చిన్న దీపం వెలుగుతుంది. ఆ గదిలో ఆదర్శ, ప్రక్కన కృపా పడుకోని ఉన్నారు. పెరట్లో వీరికి ఎదురుగానే జోగా యమ్మగారు పడుకోని ఉన్నారు. ఒక దొంగ వచ్చి ఆదర్శ చేతులూ, మెడా అన్నీ తడువ తున్నాడు. ఇంతలో కృపా గబుక్కున లేచింది. ఆదర్శ దొంగ ఒకర్నొకరు తోసు కుంటున్నాడు. కృపా అరుస్తూ దొంగను కరుస్తుంది. కాని తొందర్లో ఒకసారి ఆదర్శను కూడా కరచేసింది. ఇలా ఆ దొంగను గట్టిగా పట్టుకోని అప్ప జెప్పదామనుకుంటూ ఎదురుగా చూడబోయే సరికి ఇంకొక దొంగ జోగాయమ్మ గారిని కట్టేస్తున్నాడు. వెంటనే ఆదర్శ ఇంక కృపా వీడి పని చూస్తాడు అనే ఉద్దేశ్యముతో గబగబా జోగాయమ్మగారివైపు పరిగెత్తాడు అంతే. కృపా ఆ చీకట్లో పరిగెత్తేవాడే దొంగ కాబోలు, తను పట్టుకున్నదే ఆదర్శను కాబోలు అనుకోని ఆదర్శవైపుకి ఉరికి సుబ్బరంగా ఆదర్శను కరచి పారేసింది. అంతే ఆదర్శ కుప్పకూలిపోయాడు, దొంగలు పారి పోయారు. జోగాయమ్మగా రొచ్చి దీపాలు వెలిగించారు. వెలుగులోకి చూసారు అంతే. దీపం ఆరిపోయిందని, వెలుగులేదని తెలుసుకోని అలాగే అచేతనురాలై పోయి ఆదర్శ పాదాల మీద పడి చనిపోయారు. ఇదంతా వెలుగులో చూసిన కృపా ఆ నాటి నుంచీ ఇప్పటివరకు అలా పిచ్చెత్తిపోయి అరుస్తూ, ఆ ప్రాంతమంతా అలాగ తిరుగు తూనే ఉంది.

ఆ ఆదర్శ తాతగార్ని, ఆ కృపాను వారి ప్రేమను, వాత్సల్యాన్ని వారి జీవితాన్ని బాగా తెలియటం వల్ల నేను మొన్న ఒకసారి ఆదర్శ తాతగారి పాత్రను ఏక పాత్రాభినయం చేశాను. అలాగే మేకప్ చేసు కొని తరువాత ఆ ఏక పాత్రాభినయం అయి పోయిం తర్వాత ఆదర్శ తాతగారి లాగానే నెమ్మదిగా "కృపా" అంటూ ఆ ప్రాంతానికి వెళ్ళాను. వెంటనే దూరానున్న కృపా నన్ను చూసి నిజంగా ఆదర్శ తాతనే అనుకుందో ఏమో పరుగెత్తుకుంటూ వచ్చి నా పాదాలమీద పడి చనిపోయింది. ఎంత అనిర్వచనీయమైన పశ్చాత్తాపం! ఎంత విచిత్ర మైన విశాల దృక్పథం! ఎంత మహత్తర మైనటువంటి మానవాతీత గుణం!